III

నమస్తే తెలంగాణ

తెలంగాణ జైత్రయాత్ర 2023

హైదరాబాద్ | ఆదివారం 5 నవంబర్ 2023 www.ntnews.com

మీకు తెలుసా?

## ప్రభుత్వ దవాఖానల్లో పడకలు

| 2014లో | | 2023లో |
|---|---|---|
| సాధారణ పడకలు | ఆక్సిజన్ పడకలు | మొత్తం పడకలు |
| 17,400 | 1,400 | 34,000 (అన్నింటికీ ఆక్సిజన్ సౌకర్యం) |



■ యార్కర్



### షెయ్యి గుర్తోళ్ల కాలంల నీళ్ల తిప్పలు నీకేమెరుక?!

'ఓ పిల్లా.. బాత్రూంల నల్లాలు ఇప్పి
అస్తున్నవ్..
నీళ్లు అట్టిగ పాయిఖాన్ల కల్శిపోతున్నయ్
నువ్వుజెయ్యవట్టి ఒక ఆడకట్టుకయ్యే నీళ్లు
గంగల కలుత్తన్నయ్' అని మనుమరాలు
మీదికి కయ్యన లేసింది బాపమ్మ

ఓ ముసల్దానా.. ఎందుకొర్తున్నవే
పుల్లుగ నీళ్లు ఉండె.. రోజు నల్లా
ధారెత్తి పొయ్యనేవట్టే
నీకేమైతుందే.. నీదేమన్న
పోతున్నదా?
(మనుమరాలి గదమాయింపు)

ఆc.. నువ్వు మా కాలంల పుడితే
ఆ నీళ్ల ఇలువ తెల్శేది నీకు
ఆ కాంగిరేసోల్ల కాలంల
షెంబట్కు పోనుగూడ
షెంబెడు నీళ్లు లేకుండె..
గప్పుడు గీ పాయిఖాన్లు ఏడియి?
అవి కట్టిత్తే పజలకు రోగాలు రావన్న
సోయి గూడా లేకుండె గీ కాంగ్రెసోళ్లకు..!

పొద్దుగాల లేత్తె షెంబు పట్కోని
పొలాల పొన్న పోవుడె..
వానకాలం తప్ప ఏ కాలంలజూసినా
గా పొలాలల్ల నీళ్లు లేకపోవు..
ఇంటికేలి షెంబుల పట్క పోదామంటే
అప్పుడప్పుడు గంగాలంల
సుక్క నీరుండకపోయేది
నీళ్లు లేక ఒక్కోపారి
అచ్చేదిగూడ ఆపుకున్న రోజులున్నయ్
గసోంటి గోసలు చూశినం
నీళ్లు లేక గొడగొడ ఏడ్సినం..

గిప్పుడు కేసీఆర్ కాలు పుణ్యం
చేతి గుణం వల్ల ఏడజూసినా నీళ్లే
ఎండకాలంల గూడా చెర్లు, కాల్వలు,
వాగులు, ఒర్రెల నిండా నీళ్లే కన్పిత్తన్నయ్
ఎర్రటెండల్ల నీళ్లు మత్తడి దుంకుతున్నయ్

అట్లనీ గిప్పుడు మనం కేసీఆర్
కట్టపడి తెచ్చిన నీళ్లను కరాబ్‌జేస్తే
రేపు నీకు పుట్టబోయే పిలగాండ్లు
ఆల్లకు పుట్టేటి పిలగాండ్లకు
నీళ్లు దొర్కకుంటైతయ్

గప్పటికి గీసోంటి లీడర్ మనకుండాలి
అందుకే కేసీఆర్‌ను,
ఆయన కట్టపడి తెచ్చిన నీళ్లను
మనం కాపాడుకోవాలె!

- రాజు అతికం
9440012834



### సుజాతక్కకు పాత రోజులు గుర్తున్నయ్

**కాంగ్రెస్ కార్యకర్త:** సుజాతక్క ఈసారి కాంగ్రెస్‌కే ఓటెయ్యాలే
**సుజాత:** ఏం జేసిందయ్యా మీ కాంగ్రెస్ ? ఎందుకెయ్యాలె ?

**కాంగ్రెస్ కార్యకర్త:** మొన్ననే కాంగ్రెస్‌ల చేరిన్నక్కా. నా కోసం ఈ ఒక్కసారి చేతి గుర్తుకు ఓటెయ్యి
**సుజాత:** నీ కోసం అయితే ఓ పూట ఇంటికి రా. ఇంత చికెన్, బగార ఒండిపెడత కని ఓట్కైతె అడగకు

**కాంగ్రెస్ కార్యకర్త:** మరి ఎవర్కి ఓటేస్తవ్
**సుజాత:** పక్కా కారు గుర్తుకే ఏస్త

**కాంగ్రెస్ కార్యకర్త:** ఏందక్కో గంత పక్కాగ చెప్పవడ్తివి
**సుజాత:** కాంగ్రెస్ ఉన్నప్పుడు వారానికోపారి నీళ్ల ట్యాంకర్ ఒస్తుండే. రెండు బిందెల నీళ్లు వట్టేందుకు ట్యాంకర్ ఒచ్చినప్పుడల్లా బస్తోళ్లకు కొట్లాటలే ఉంటుండె. పొద్దుగాల మొఖాలు చూసుకోకుండా అయ్యేటోల్లం. నీ పెండ్లాం తోటి గిట్ల ఎన్నిసార్లు లొల్లాయె.


**కాంగ్రెస్ కార్యకర్త:** గవన్నీ ఇంక గుర్తున్నాయక్కా నీకు
**సుజాత:** అన్ని గుర్తున్నయ్. ఇయాల కేసీఆర్ పుణ్యాన సరిపోను నల్ల నీళ్లొస్తున్నయ్. పాతయి మర్వను. కారుకు ఓటేసుడు మర్వను. మరిస్తే ఇమానం తప్పినట్టే.

**కాంగ్రెస్ కార్యకర్త:** సరే అక్కా... ఇగ నువ్వు ఎన్ని చెప్పినా ఇనవు. ఉంట.

- వరుణ్

నీళ్లు లేక నోళ్లు తెరిచిన బీళ్లు. ఉపాధి కరువైన ఊళ్లు.. వెరసి ఆకలి చావులు. పట్టణాలకు వలసలు. లేబర్ అడ్డాలపై పనికోసం వెతుకులాటలు. దినదిన గండంగా గడిచిన బతుకులు... ఇదీ ఒకనాటి తెలంగాణ పల్లెల బతుకుచిత్రం! ఇదంతా గతం.. ఇప్పుడు ఆ శిశిరం ముగిసింది. మండుటెండల్లోనూ చెరువులు తడలుగొడుతున్నాయి. ఎండిన వాగు ఎడతెగక పారుతున్నది. పట్టెడు గింజలు రాల్చని భూమి పుట్లకొద్దీ ధాన్యాన్ని ఇస్తున్నది. కైకిలి దొరకని కాలం నుంచి కైకిలోళ్లు దొరకని కాలమొచ్చింది. మూడు కాలాల్లోనూ కూలీ పని ఉంటుండడంతో ఒకనాడు వలసపోయిన తెలంగాణ పల్లెలకే ఈనాడు ఎక్కడెక్కడి నుంచో వలస వస్తున్నారు. ఇదీ స్వరాష్ట్ర ఫలం. సాకారమైన అమరుల స్వప్నం. సీఎం కేసీఆర్ పాలనా దక్షతకు నిదర్శనం.

బిగ్ స్టోరీ



# మూడుంగాలాలూ కైకిలి

- స్వరాష్ట్రంలో రోజువారీ కూలీలకు బతుకు భరోసా
- వేజ్ ఇండికేటర్‌లో తెలంగాణ టాప్

- నీటి వనరుల పెంపుతో గ్రామాల్లో పెరిగిన ఉపాధి రోజులు
- గతంలో 180 రోజులు మించని వైనం
- నేడు దాదాపు 300 రోజులపాటు పనులు
- రాష్ట్రవ్యాప్తంగా సగటు కూలీ రూ.350
- ట్రాక్టర్లు, హార్వెస్టర్లకు డిమాండ్

... మ్యాకం రవికుమార్

తెలంగాణ వ్యవసాయిక ప్రాంతం. రాష్ట్ర జనాభాలో దాదాపు 70 శాతం మందికి పైగా ప్రత్యక్షంగా, పరోక్షంగా వ్యవసాయం, అనుబంధ రంగాలపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. అయితే, ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ బతుకు చిత్రం ఛిన్నాభిన్నమయ్యింది.

### 'మిషన్' వ్యూహంతో పూర్వవైభవం

కానీ తెలంగాణ ఏర్పాటు అనంతరం గడచిన తొమ్మిదిన్నరేండ్లలో సర్కారు అమలు చేసిన బహుముఖ వ్యూహాలు నేడు ఆ పరిస్థితులన్నింటినీ తారుమారు చేసింది. మిషన్ కాకతీయ, చెక్‌డ్యాంలు, ప్రాజెక్టుల నిర్మాణం ఫలితంగా పాతాళ గంగమ్మ పరవళ్లు తొక్కుతున్నది. ఏడాది పొడవునా చెరువులు తడలుగొడుతుండగా, ఒకనాడు ఎండిన వాగులన్నీ నేడు జీవధారలయ్యాయి. ఫలితంగా వ్యవసాయ స్థిరీకరణ పొందుతున్నది. నికరంగా రెండు పంటలకు భరోసా లభించింది.

**ఇతర వ్యవసాయ కూలీలకు సగటు రోజు కూలీ..**

| రాష్ట్రం | రోజుకూలీ (సగటు ) రూ.లలో | 2016-17తో పోల్చితే పెరుగుదల శాతం |
|---|---|---|
| తెలంగాణ | 462 | 58.9 |
| తమిళనాడు | 466 | 28.9 |
| మహారాష్ట్ర | 372 | 24 |
| మధ్యప్రదేశ్ | 282 | 17.1 |
| గుజరాత్ | 237 | 29 |
| కర్ణాటక | 353 | 8.6 |
| యూపీ | 288 | 27.6 |
| బీహార్ | 309 | 25.3 |

(నోట్: మహిళల జాతీయ సగటు వ్యవసాయ కూలీ రూ.353)

### ఎత్తయిన తెలంగాణ పేదరికం లోతుల్లోకి...

తెలంగాణ ఎత్తయిన ప్రాంతం. నేల మీద పడిన వర్షం నీరు పడ్డది పడ్డట్టు కిందికి జారిపోతుంది. ఈ భౌగోళిక పరిస్థితుల కారణంగానే కాకతీయులు గొలుసుకట్టు చెరువులు నిర్మించారు. ఫలితంగా బంగారు పంటలు పండించారు. కానీ ఉమ్మడి రాష్ట్రంలో పాలకుల కుట్రల ఫలితంగా ఆ చెరువులు పూర్తిగా మట్టి కొట్టుకుపోయాయి. ఏళ్లు గడిచినకొద్దీ భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. సాగు నీటి ప్రాజెక్టులు పేరుకే తప్ప కాలువలు పార లేదు.. శెల్కల దూపతీరలేదు.. వెరసి ఎవుసానికి వర్షంపై ఆధారపడడం తప్ప మరో మార్గం లేని దుస్థితి. నీళ్లు ఉన్నచోట బోర్లతోని సాగు చేద్దా మన్నా కరెంటు ఎప్పుడు ఉంటదో? ఎప్పుడు పోతదో తెల్వదు. కనీసం ఒక్క పంట కూడా పండని కరువులకు నిలయమైంది. ఫలితంగా తెలంగాణలో వ్యవసాయ రంగం అస్థిరతకు గురైంది. వర్షాల ఆధారంగానే కొనసాగింది. కాలమైనప్పుడే పంటలు పండే దయనీయ స్థితికి చేరింది. తెలంగాణ ఏర్పాటు నాటికి 2015లో ఏకంగా రాష్ట్రంలో 231 మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించారంటే పరిస్థితి ఎలా ఉండేదో అర్థం చేసుకోవచ్చు.

### ఏడాది పొడవునా కైకిలి...

2011 లెక్కల ప్రకారం తెలంగాణ ప్రాంతంలో దాదాపు 31 లక్షల మంది సాగుదారులు ఉండగా, 30-40 లక్షల మందికిపైగా వ్యవసాయ కూలీలు ఉన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఎవుసం అస్థిరతకు గురైన వేళ వ్యవసాయ సీజన్‌లో నికరంగా నాడు 120-180 రోజులకు మించి పనులు లభించని దైన్యం. దీంతో ఉన్న ఊరిలో చేతినిండా పని కరువైన వేళ తెలంగాణ పల్లెలన్నీ పట్టణాలకు బాటకట్టాయి. ఉమ్మడి పాలమూరు జిల్లానే కాదు, రాష్ట్రంలోని ఉమ్మడి వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలా బాద్, ఖమ్మం జిల్లాల్లోని అనేక ప్రాంతాలవారికి వలస కష్టాలు తెలుసు. ఇప్పుడు చెరువుల్లో నీటి నిల్వలు పెరగడంతో మత్స్య పరిశ్రమతోపాటు, పాడిపరిశ్రమ సైతం వేగంగా వృద్ధిని సాధిస్తున్నది. వ్యవసాయానుబంధ పరిశ్రమలు సైతం విస్తరిస్తున్నాయి. ఫలితంగా నేడు ఉన్న ఊరిలోనే ఉపాధికి ఢోకా లేకుండాపోయింది. ఏడాది పొడవునా కైకిలి లభిస్తున్నది. కూలీల ఆదాయానికి భరోసా లభించింది. తక్కువలో తక్కువ అనుకున్నా నేడు రోజు కూలీ సగటున రూ.350 వరకు లభిస్తుండడం విశేషం.

### పల్లె ఆడబిడ్డల్లో వెల్లివిరుస్తున్న ఆనందం...

వ్యవసాయ అభివృద్ధి, అనుబంధ రంగాల్లో మహిళలు కీలక పాత్ర పోషిస్తారు. మహిళల ప్రమేయం లేకుండా వ్యవసాయం ముందుకు సాగదంటే అతిశయోక్తేమీ కాదు. విత్తడం, కలుపు తీయడం, నీటిపారుదల, ఎరువుల అప్లికేషన్, గడ్డి కోత, తీయడం, పత్తి కర్ర సేకరణ, ఫైబర్ నుంచి విత్తనాలను వేరు చేయడం, పశుపోషణ, పాలు పితకడం, పాల ప్రాసెసింగ్, నెయ్యి తయారీ వంటి ఇతర సంబంధిత కార్యకలాపాల్లో క్రియాశీలక పాత్ర పోషిస్తారు. మేతతోపాటు పశుపోషణలో మిగతా నిర్వహణ కార్యకలాపాలన్నీ ప్రధానంగా మహిళలే చూస్తారు. మహిళలు వివిధ వ్యవసాయ కార్యకలాపాల్లోనే కాదు, వ్యవసాయంలో ఉత్పాదకతను పెంపొందించడానికి ఉత్పత్తి, పంటకు ముందు, పంట అనంతర ప్రాసెసింగ్, ప్యాకేజింగ్, మార్కెటింగ్ వంటి అన్ని స్థాయిల్లో మహిళలు చురుగ్గా పాల్గొంటారు. నేడు రాష్ట్రంలో వ్యవసాయం స్థిరీకరణ పొందడంతో ఊరిలోనే చేతినిండా, పనికి తగిన కూలీ లభిస్తుండడంతో ప్రధానంగా ఆడబిడ్డల్లో ఆనందం వెల్లివిరుస్తున్నది.

**పెద్ద రాష్ట్రాల్లో పురుష వ్యవసాయ కూలీల సగటు కూలీ..**

| రాష్ట్రం | 2022-23 రోజు కూలీ (రూ.లలో) | 2016-17తో పోల్చితే పెరుగుదల శాతం |
|---|---|---|
| తెలంగాణ | 418 | 44.1 |
| తమిళనాడు | 441 | 34.8 |
| మహారాష్ట్ర | 312 | 126 |
| మధ్యప్రదేశ్ | 283 | 23 |
| గుజరాత్ | 263 | 24 |
| కర్ణాటక | 357 | 10 |
| యూపీ | 283 | 22 |
| బీహార్ | 316 | 34 |

(నోట్: పురుషుల జాతీయ సగటు వ్యవసాయ కూలీ రూ.342)

**పెద్ద రాష్ట్రాల్లో మహిళా వ్యవసాయ కూలీల సగటు కూలీ**

| రాష్ట్రం | 2022-23 రోజు కూలీ (రూ.లలో) | 2016-17తో పోల్చితే పెరుగుదల శాతం |
|---|---|---|
| తెలంగాణ | 293 | 56.8 |
| తమిళనాడు | 208 | 36.1 |
| మహారాష్ట్ర | 231 | 150 |
| మధ్యప్రదేశ్ | 238 | 19.1 |
| గుజరాత్ | 248 | 7.2 |
| కర్ణాటక | 257 | -8.5 |
| యూపీ | 262 | 22 |
| బీహార్ | 282 | 7.2 |

(నోట్: మహిళల జాతీయ సగటు వ్యవసాయ కూలీ రూ.285)

### మరిన్ని అదనపు ఉపాధి అవకాశాలు...

రాష్ట్రంలో వ్యవసాయ స్థిరీకరణ జరుగుతుండడంతో గ్రామీణ ప్రాంతాల్లో ఇతర ఉపాధి అవకాశాలు సైతం గణనీయంగా పెరుగుతున్నాయి. వ్యవసాయ స్థిరీకరణతో ఇప్పటికే రాష్ట్రంలో వ్యవసాయ యాంత్రికత దాదాపు 50 శాతానికి చేరుకున్నది. ప్రత్యక్షంగా మరింత మందికి ఉపాధి అవకాశాలు పెరిగాయి. నిర్మాణ రంగం విస్తరిస్తున్నది. అందుకు అనుబంధంగా ఉండే ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, ఇటుకల తయారీ, పేపర్ ప్లేట్స్ మాన్యుఫాక్చరింగ్, క్యాటరింగ్, ఇంజినీరింగ్ వర్క్స్, ఫర్నిచర్ తయారీ తదితర సూక్ష్మస్థాయి పరిశ్రమలు సైతం విస్తృతంగా గ్రామాల్లోకి అందుబాటులోకి వస్తున్నాయి.





### వలసపోయిన పల్లెలకే ఇతర రాష్ట్రాల నుంచి వలసలు...

రాష్ట్రంలో వ్యవసాయ స్థిరీకరణతో వలసలన్నీ ఆగిపోయాయి. పల్లెను, ఎవుసాన్ని విడిచిన వెళ్లిన చిన్న, సన్నకారు రైతులు తిరిగి పల్లెకు చేరుకొని ఎవుసాన్ని సాగిస్తున్నారు. ఒకనాడు వలసపోయిన తెలంగాణ పల్లెలకే నేడు ఇతర రాష్ట్రాల నుంచే కూలీలు వలసబాట పడుతుండడం గర్వకారణం. నికరమైన పనులు, పనికి తగిన కూలీ రేట్లు లభిస్తుండడంతో పొరుగున ఉన్న ఏపీతోపాటు ఒడిశా, బీహార్, ఛత్తీస్‌గఢ్, బెంగాల్ తదితర రాష్ట్రాల నుంచి వేలాది మంది వలసవస్తూ తెలంగాణలో పొట్ట పోసుకుంటున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, వరంగల్, ఖమ్మం, కరీంనగర్ జిల్లాలకు ఇతర రాష్ట్రాల కూలీలు బృందాలు బృందాలుగా తరలివచ్చి సీజన్‌లో వ్యవసాయ పనులు చేస్తుండడం విశేషం. రోజువారీ కూలీకి కాకుండా నాట్లు వేయడం తదితర పనులను ఎకరాకు రూ.4500-6000 చొప్పున గంపగుత్తగా మాట్లాడుకొని పనులు సాగిస్తున్నారు. నాటు పనులకే కాదు గ్రామీణ ప్రాంతాల్లో ఇతర పనులకు కూడా ఇతర రాష్ట్రాల నుంచి కూలీలు వరుస కడుతున్నారు.

# కార్పొరేటర్‌గా నిలిచి.. ఎమ్మెల్యేగా గెలిచి



- అంచెలంచెలుగా ఎదిగి ఎమ్మెల్యేలు, మంత్రులుగా సేవలు
- తాజాగా ఎన్నికల్లో మళ్లీ బరిలో నిలిచిన పలువురు అభ్యర్థులు

నాయకుడిగా ఎదగాలంటే ఎక్కడో ఒక దగ్గర ప్రస్థానం ప్రారంభం కావాల్సిందే. ఏ పెద్ద లీడర్‌ను తీసుకున్నా గల్లీ లీడర్ నుంచి ఎదిగినవారే. కౌన్సిలర్‌గానో.. కార్పొరేటర్‌గానో జర్నీ మొదలుపెట్టినవారే. అంచెలంచెలుగా ఒక స్థాయికి వచ్చినవారే. ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల్లో తలపడుతున్న వారిలో ఇదే కోవకు చెందినవారు చాలా మందే ఉన్నారు. వారెవరెవరో ఓ లుక్కేద్దాం.

**తాజాగా బరిలో నిలిచినవారు...**

◆ మంత్రి గంగుల కమలాకర్ కరీంనగర్ మున్సిపాలిటీలో 2000 సంవత్సరంలో కౌన్సిలర్‌గా రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించారు. తర్వాత కార్పొరేటర్‌గా గెలిచి, కార్పొరేటర్‌గానే అసెంబ్లీ ఎన్నికల్లో తలపడి విజయం సాధించారు. కరీంనగర్ సెగ్మెంట్ నుంచి హ్యాట్రిక్ విజయాన్ని నమోదు చేయడమే కాకుండా ప్రస్తుతం మంత్రిగా కొనసాగుతూ, ఇక్కడి నుంచే నాలుగోసారి పోటీలో ఉన్నారు.

◆ వరంగల్ ఈస్ట్, వెస్ట్ ఎమ్మెల్యేలు నన్నపునేని నరేందర్, దాస్యం వినయ్‌భాస్కర్‌లిద్దరు గతంలో కార్పొరేటర్లుగా గెలిచినవారే. నరేందర్ మేయర్‌గా ఉండి, ఎమ్మెల్యేగా గెలిచారు. వినయ్‌భాస్కర్ హ్యాట్రిక్ విజయాన్ని నమోదుచేశారు. తాజాగా వీరిద్దరూ మరోసారి పోటీ చేస్తున్నారు.

◆ డిప్యూటీ స్పీకర్, సికింద్రాబాద్ బీఆర్‌ఎస్ అభ్యర్థి టీ పద్మారావు 1984, 2001ల్లో మున్సిపల్ ఎన్నికల్లో గెలిచారు. సికింద్రాబాద్ నుంచి మూడుసార్లు గెలిచిన పద్మారావు మంత్రిగానూ సేవలందించి, అదే స్థానం నుంచి మళ్లీ తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు.

◆ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ 1986లో మోండా డివిజన్ నుంచి జనతా పార్టీ తరపున పోటీ చేసి ఓడిపోయారు. తర్వాత సికింద్రాబాద్ నుంచి మూడు సార్లు, సనత్‌నగర్ నుంచి రెండుసార్లు గెలిచి మంత్రిగా సేవలందించారు. తాజా ఎన్నికల్లో సనత్‌నగర్ సెగ్మెంట్ నుంచి బరిలోకి దిగారు.

◆ ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ జవహర్‌నగర్ డివిజన్ నుంచి కార్పొరేటర్‌గా గెలిచి తన ప్రస్థానాన్ని ప్రారంభించారు. 2018లో తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచిన ముఠా గోపాల్ మళ్లీ ముషీరాబాద్ నుంచే బరిలో నిలిచారు.

◆ ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి సైతం కార్పొరేటర్‌గానే రాజకీయ జీవితాన్ని ప్రారంభించారు. ఆయన అక్బర్‌బాగ్ నుంచి కార్పొరేటర్‌గా గెలిచి తదనంతరం ఎమ్మెల్యే అయ్యారు. రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి, మళ్లీ ఎల్బీనగర్ నుంచే బీఆర్‌ఎస్ అభ్యర్థిగా తలపడుతున్నారు.

... కొంటు మల్లేశం